సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 23 । జూన్ । 2023



రికార్డుల డిజిటలైజేషన్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులు డిజిటల్ చేస్తున్నారు. పాత రికార్డులను ఆన్‌లైన్ చేస్తున్నారు. - 8లో



లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

పైడిభీమవరం వద్ద ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టింది. ఐదుగురు గాయపడ్డారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	37°	26°
ఇచ్ఛాపురం	39°	26°
పాతపట్నం	38°	25°
శ్రీకాకుళం	38°	26°

న్యూస్‌రీల్

కూర్మావతారంలో జగన్నాథుడు



సోంపేటలో కూర్మావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు

సోంపేట: జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా సోంపేట కోదండ రామ స్వామి దేవాలయంలో, బారువలో గురువారం జగన్నాథ స్వామి కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోంపేట, బారువ పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లాలో వానలకు అవకాశం

ఆమదాలవలస: రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో శుక్ర, శనివారం భారీ వర్షాలు పడే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వరి విత్తనాలు వేసుకునే రైతులు అప్రమత్తంగా ఉండి విత్తనాలు జల్లుకోవాలని సూచించారు. రెండు రోజుల తర్వాత విత్తనాలు వేసుకునేందుకు అనువుగా ఉంటుందని ఆమె తెలిపారు.

డీఎల్‌టీసీ ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ / ఐటీఐ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్‌హబ్‌లో పీఎంకేవీవై 4.0 పేరిట వివిధ స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏడీ వై.రామ్మోహనరావు తెలిపారు. ముందుగా అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, టైలరింగ్ కోర్సులను మూడు నెలల స్వల్పకాలిక శిక్షణ వ్యవధితో అందిస్తున్నట్లు చెప్పారు. అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు పురుషులు, మహిళలు ఇంటర్మీడియెట్ లేదా ఆపై విద్యార్హత కలిగి 18 నుంచి 27 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. టైలరింగ్‌కు 5వ తరగతి లేదా ఆపైన చదివిన మహిళలై 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 27తో గడువు ముగుస్తుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్ జిరాక్స్‌లతో హాజరై శ్రీకాకుళం ప్రభుత్వ ఐటీఐ శిక్షణ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7095731303 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.


నేడు ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ జరగనున్న శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇదే

శ్రీకాకుళం న్యూకాలనీ: మినిమమ్ టైమ్ స్కేల్ సెకండరీ గ్రేడ్ టీచర్లకు(1998, 2008) మేలు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వారు నివాసం ఉన్న మండల సమీప ప్రాంతాల్లోని పాఠశాలల్లో పనిచేసేలా చర్యలు తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో మొత్తం 436 మినిమం టైమ్ స్కేల్ టీచర్లకు మేలు జరగనుంది. జిల్లాలో డీఎస్సీ–2008 ఎంటీఎస్ ఎస్‌జీటీ టీచర్లు 111 మంది, డీఎస్సీ–1998 ఎంటీఎస్ ఎస్‌జీటీ టీచర్లు 325 మంది ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరందరికీ మేలు చేసేలా పాఠశాల విద్యాశాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంది. వారి నివాస ప్రాంతం నుంచి సమీప పాఠశాలలను ఎంచుకునేందుకుగాను కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా ఉదయం 10 గంటల నుంచి 2008 డీఎస్సీ ఎంటీఎస్ వారికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ జరపనున్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులంతా వారి వారి నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం వారి అపాయింట్‌మెంట్ లెటర్ ఆర్డర్ జిరాక్స్‌కాపీతోపాటు నివాసం ధ్రువీకరించే పత్రాన్ని విధిగా తీసుకురావాల్సి ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. ఈ సదవకాశాన్ని ఎంటీఎస్ టీచర్లంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కంటికి కాపలా





'కంటి వెలుగు'లో సిక్కోలు ఫస్ట్

- స్క్రీనింగ్, సర్జరీల్లో రాష్ట్రంలోనే జిల్లాకు తొలిస్థానం
- 60 ఏళ్లు దాటిన వారిలో 2.22 లక్షల మందికి స్క్రీనింగ్ పూర్తి
- 11,168 సర్జరీలతో టాప్‌లో జిల్లా

అరసవల్లి: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న 'డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమం జిల్లాలో అద్వితీయంగా జరుగుతోంది. స్క్రీనింగ్, సర్జరీల్లో సిక్కోలు ఏకంగా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించి లక్షలాది మంది కంటి సమస్యలను పరిష్కరించింది. వివిధ సర్వేల ఆధారంగా 60 ఏళ్లు దాటిన వారిని గుర్తించి వారి పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయాలకు జాబితాను పంపించి కంటి పరీక్షలకు షెడ్యూల్‌ను అమలు చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో ప్రాథమిక పరీక్షల్లో ఆప్తమాలజిస్టుల పర్యవేక్షణలో విడివిడిగా రెండు కళ్లను పరీక్షించి (స్క్రీనింగ్) సమస్యలను గుర్తించి, మందులతో నయం చేస్తున్నారు. కళ్ల అద్దాలు అవసరమయ్యేవారు, శుక్లాల సమస్యలున్న వారికి ఆపరేషన్లు చేయించుకోవాల్సిన వారిని వేర్వేరుగా గుర్తించేలా చర్యలు చేపడుతున్నారు. ఇవన్నీ ప్రభుత్వం తరఫునే ఉచితంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాకే ప్రథమ స్థానం

జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి పర్యవేక్షణలో వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం జిల్లాలో ప్రగతి పథంలో నడుస్తోంది. తాజాగా వెల్లడించిన వివరాల మేరకు స్క్రీనింగ్ పరీక్షలతో పాటు కేటరాక్ట్ సర్జరీల్లో కూడా మన జిల్లాయే రాష్ట్ర వ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచింది.

- జిల్లాలో ఈ కార్యక్రమం అమలుకు సచివాలయాల వారీగా పరీక్షల నిర్వహణకు ప్రత్యేకంగా 21 బృందాలు పనిచేస్తుండగా జిల్లాలో 60 ఏళ్ల పైబడిన వారు 2,80,398 మందిని గుర్తించారు.
- వీరిలో 2,22,839 మందికి స్క్రీనింగ్ పరీక్షలను జరిపించారు. దీంతో 79 శాతం పూర్తి చేసి రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.
- అలాగే 1,38,018 మందికి సాధారణ కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో వివిధ ప్రమాణాల మేరకు 66,375 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించగా, 52,061 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసి, 78.43 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు.



కళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం..



వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం అమలులో జిల్లాకు ప్రథమ స్థానం దక్కడం ఎంతో ఆనందంగా ఉంది. మరింత ఉత్సాహంగా, బాధ్యతగా పనిచేసేందుకు ఈ గుర్తింపు తోడ్పడుతుంది. ఈ కార్యక్రమం అమలుపై పలుచోట్ల సమీక్షలు నిర్వహించాం. వందశాతం లక్ష్యం సాధించాలని పనిచేస్తున్నాం. 60 ఏళ్లు దాటిన ప్రతి వారిని చెక్ చేసి సరిపడా మందులు గానీ, కంటి అద్దాలుగానీ, సర్జరీలు గాని ఉచితంగానే చేయిస్తున్నాం. 21 బృందాలు సచివాలయాలకు వెళ్లి పనిచేస్తున్నాయి. ఏఎన్ఎం, ఆశ వర్కర్ ద్వారా కంటి అద్దాలు అందజేసి వారి ఫొటోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నాం.

– డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

- ఇక శుక్లాల సమస్యలతో కేటరాక్ట్ ఆపరేషన్లను 17,879 మందికి చేయాల్సి ఉండగా, ప్రస్తుతానికి 11,168 మందికి ఆపరేషన్లు పూర్తి చేసి 62.46 శాతం సర్జరీల లక్ష్య శాతానికి చేరుకున్నారు.
- దీంతో ఇంకా 6711 మందికి సర్జరీలు చేయాల్సి ఉంది. ఈ నివేదికల ఆధారంగా అటు స్క్రీనింగ్ పరీక్షలతో పాటు సర్జరీల్లోనూ రాష్ట్రంలో మన జిల్లాకు ప్రథమ స్థానం దక్కింది.
- ఆపరేషన్ల విషయంలో రాష్ట్రంలో పది వేలకు మించిన ఆపరేషన్లు కేవలం రెండు జిల్లాల్లోనే పూర్తి కాగా మన జిల్లాలో 11,168 ఆపరేషన్లు పూర్తి చేశారు. పొరుగున ఉన్న విజయనగరం జిల్లా 10,438 సర్జరీలతో ద్వితీయ స్థానంలో ఉంది.

101 కిలోల గంజాయి పట్టివేత



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

సోంపేట: జిల్లాను మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. మండలంలోని పురుషోత్తపురం చెక్ పోస్టు వద్ద బుధవారం రాత్రి 101 కిలోల గంజాయి, 1.031 కిలోల నల్లమందు తరలిస్తున్న ఇద్దరు మహిళలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది అరెస్టు చేశారు. ఈ గంజాయి, నల్లమందును ఎస్పీ జీఆర్ రాధిక గురువారం సాయంత్రం సోంపేట పోలీస్‌స్టేషన్‌లో పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆమె తెలిపిన వివరాల మేరకు..

ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు డిప్యూటీ తహసీల్దార్, గ్రామ రెవెన్యూ అధికారితో కలిసి పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద పటియా ధనలక్ష్మి, కొంతల సోదమ్మ నిర్వహిస్తున్న రెండు పాన్, టీషాపులను బుధవారం రాత్రి పరిశీలించారు. వీరి షాపుల్లో 13.613 కిలోల గంజాయి లభించింది. అనంతరం వారి వద్ద సేకరించిన సమాచారం మేరకు వారు నివసిస్తున్న అద్దె ఇళ్లను పరిశీలించగా వేర్వేరు గదుల్లో 87.416 కిలోల గంజాయి, ధనలక్ష్మి ఇంటిలో 1.031 కిలోల నల్లమందు దొరికింది. దీంతో వీరి వద్ద నుంచి మొత్తం 101.03 కిలోల గంజాయి, 1.031 నల్లమందు స్వాధీనం చేసుకున్నారు. ఈ సరుకు ఒడిశాలోని సంతల్లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొన్నట్లు మహిళలు తెలిపారు. వీటిని లారీ డ్రైవర్లు, క్లీనర్లు తమ షాపు వద్ద కొంటుంటారని చెప్పారు.

జిల్లాలో 2019 నుంచి 2023 వరకు పోలీసు సిబ్బంది మొత్తం 77 గంజాయి కేసులు, ఎస్ఈబీ 7 గంజాయి కేసులు నమోదు చేసిందని ఎస్పీ తెలిపారు. ఈ కేసుల్లో మొత్తం 232 మందిని పోలీసులు, తొమ్మిది మందిని ఎస్ఈబీ సిబ్బంది అరెస్టు చేశారని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసులు 11,885 కిలోల గంజాయి, ఎస్ఈబీ ద్వారా 261కిలోల గంజాయి పట్టుకున్నారని తెలిపారు. తాజాగా దొరికిన సరుకును మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ధ్వంసం చేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టడానికి 66 మంది లాడ్జీ యజమానులకు, 66 మంది ట్రాన్స్‌పోర్టు యజమానులకు నోటీసులు ఇచ్చామన్నారు. కళాశాలల వద్ద కూడా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్న ఎస్ఈబీ టీమ్‌ను అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ విజయ్ మణికంఠ, కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి, సోంపేట సీఐ రవి ప్రసాద్, సోంపేట, కంచిలి, బారువ ఎస్ఐలు హైమావతి, ఎస్.బాలరాజు, చిరంజీవి, ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతన్నకు ఆపన్న హస్తం





చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు బుడ్డ లక్ష్మణరావు. ఈయనకు చెందిన గేదె అనారోగ్యంతో చనిపోయింది. దీంతో ప్రభుత్వం రూ.30వేల పరిహారం అందజేసింది. దీంతో లక్ష్మణరావుకు కొంత ఆర్థిక భరోసా కలిగింది.

- అన్నదాతలను ఆదుకుంటున్న 'వైఎస్సార్ పశు నష్ట పరిహారం'
- పథకం ద్వారా 4256 మందికి పరిహారం పంపిణీ

టెక్కలి: పాడి సంపద అన్నదాతకు అదనపు బలం. వ్యవ'సాయానికి' కొన్ని జీవాలు, ఇంటి పోషణకు ఇంకొన్ని జీవాలు ఎప్పటి నుంచో రైతన్నకు తోడుగా ఉంటున్నాయి. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రమాదవశాత్తు ఈ పాడి సంపద మృతి చెందితే ఇదివరకు నష్ట పరిహారం అందుకోవడం ఓ ప్రహసనంగా ఉండేది. బీమా చేయించినా ఆ పరిహారం డబ్బు అందుకునే సరికి చాలా సమయం పట్టేది. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. పశు యజమానుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ప్రమాదాల్లో మృత్యువాత పడిన పశువులకు పరిహారం అందజేసి తద్వారా ఆయా యజమానులకు ఆర్థికంగా ఆదుకునేందుకు 2019లో 'వైఎస్సార్ పశు నష్ట పరిహారం' పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకంలో భాగంగా ఇటీవల జిల్లాకు సుమారు రూ.12.74 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుతం విడతల వారీగా బాధిత యజమానుల ఖాతాలకు పరిహారాన్ని అందజేస్తున్నారు. గతంలో 811 మంది బాధిత యజమానులకు రూ.2.27 కోట్లను అందజేశారు.



గతంలో మృత్యువాత పడిన మేకలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

రూ.12.74 కోట్ల పరిహారం..

వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకంలో భాగంగా ప్రకృతి విపత్తులు, కొన్ని రకాల ప్రమాదాల బారిన పడిన ఆవులు, గేదెలకు రూ.30 వేలు, రూ.15 వేలు, గొర్రెలు, మేకలకు ఒక్కొక్కింటికి రూ.6 వేల చొప్పున పరిహారం అందజేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 4256 మంది బాధిత పశు యజమానులకు రూ.12.74 కోట్లను విడుదల చేశారు. ఇప్పటికే 3445 మంది యజమానులకు రూ.9.65 కోట్లు వారి ఖాతాల్లో పడ్డాయి. 2019–20 ఆర్థిక సంవత్సరంలో 811 మంది బాధిత యజమానులకు అప్పట్లో రూ.2.27 కోట్లను అందజేశారు.



వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం అవగాహన పోస్టర్

చక్కటి పథకం



దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం అమలు చేశారు. ప్రమాదాలు, ఇతర సంఘటనల్లో పశువులు కోల్పోయిన యజమానులకు ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేశారు. జిల్లా వ్యాప్తంగా విడుదలైన పరిహారాన్ని ఆయా యజమానులకు ఖాతాలకు చెల్లింపులు చేస్తున్నాం.

– ఎం.కిషోర్, పశు సంవర్ధక శాఖ జేడీ

వందశాతం సేవలు అందించేందుకే జగనన్న సురక్ష

- స్పీకర్ తమ్మినేని సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ వందశాతం సేవలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన గురువారం ఆమదాలవలసలో పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల సేవలను ప్రతి ఇంటికి, అవసరమైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించారని, అధికారులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చిందని, 1902 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఎందరో తమ సమస్యలను సీఎంకు నివేదించారని పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారన్నారు. నాలుగు వారాల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జూన్ 24వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఎలాంటి సమస్యలు పరిష్కారం అవుతాయి, ఏ సర్టిఫికెట్లు ఇస్తారు, ఇతర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి టీమ్‌లో ముగ్గురు అధికారులు ఉంటారని, 24 గ్రామాల కన్నా ఎక్కువ ఉంటే మూడు టీమ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వద్ద నిర్వహించే క్యాంపుల్లో 11 సర్వీసులకు ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. వినతుల స్వీకరణ, రిజిస్ట్రేషన్లు, వెరిఫికేషన్‌లకు వివిధ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

టీడీపీ హయాంలో అరాచక పాలన



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగిందని, ఆయనకు అధికారం ఇస్తే అరాచకం ఇంకా పెరుగుతుందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. ఆయన గురువారం మండలంలోని బాతుపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు వస్తుండడంతో చంద్రబాబు మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ చేస్తున్న సంక్షేమ పనులు చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని దుమ్మెత్తిపోశారు. నాడు–నేడు, అమ్మ ఒడి, ఆసరా, చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో జగన్ జనానికి చేరువయ్యారని అన్నారు. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక సర్పంచ్ బత్తిన సృజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధా న కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మండల ప్రత్యే క ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు గురయ్యనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు డి.మధుకేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి టి.శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సస్పెన్షన్



వాండ్రాడ సచివాలయంలో అందుతున్న సేవలపై సిబ్బందిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

కోటబొమ్మాళి: అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటబొమ్మాళి ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కావ్యశ్రీని ఆయన గురువారం సస్పెండ్ చేశారు. కలెక్టర్ గురువారం మండలంలోని శ్రీజగన్నాథపురం, వాండ్రాడ సచివాలయాలను తనిఖీ చేశారు. శ్రీజగన్నాథపురం జగన న్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో జాప్యంపై ఆరా తీశారు. నీటి సదుపాయం లేకపోవడంతో నిర్మాణా లు చేయలేకపోతున్నామని లబ్ధిదారులు కలెక్టర్‌కు చెప్పడంతో ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈని ప్రశ్నించారు.

తన దృష్టికి ఈ సమస్య రాలేదని జేఈ బదులివ్వడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమెను సస్పెండ్ చేశారు. తక్షణం అక్కడ నీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. అంతకుముందు వాండ్రాడ సచివాలయాన్ని తనిఖీ చేశారు. జగనన్న భూ సర్వే వివరాలను తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ కలెక్టర్‌కు వివరించారు. జూలై 1 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, డీటీ ఆర్.మధు, ఏపీఎం కె.రాము, మండల జేఈ లతాశ్రీ, డ్వామా జేఈ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

25న టెక్కలిలో ఆట్యా-పాట్యా జిల్లా జట్టు ఎంపికలు

టెక్కలి: జిల్లా ఆట్యా-పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న టెక్కలిలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ బి.నారాయణరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14 బాలురు, బాలికల విభాగంలో నిర్వహిస్తున్న ఎంపికలకు 2009 తర్వాత పుట్టిన వారు అర్హులని ఆయన వెల్లడించారు. ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు నారాయణరావు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన జట్టు జూలై 1, 2 తేదీలలో తునిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

1 నుంచి కార్మిక సంఘం శిక్షణ తరగతులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు జూలై 1 నుంచి 3వ తేదీ వరకు శ్రీకాకుళం యూటీఎఫ్ కార్యాలయంలో జరగనున్నాయని, వాటిని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం కోరారు. శ్రీకాకుళం జిల్లా కార్యాలయంలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పనులకు గిట్టుబాటు వేతనం కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి ఇవ్వాలని, అన్యాక్రాంతమైన భూములు స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా నాయకులు గంగరాపు ఈశ్వరమ్మ, కొల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలై 25,26 తేదీల్లో పురోహిత పరీక్షలు

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య నిర్వహణలో చిత్తూరు జిల్లా తిరుపతిలో జూలై 25, 26 తేదీల్లో పురోహిత/స్మార్త పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు తెన్నేటి సునీల్ శర్మ తెలిపారు. ఈ పరీక్షలో పాల్గొనే వారికి వారి సూత్రానుసారంగా పరీక్ష నిర్వహించి, వారి సామర్థ్యాన్ని అనుసరించి పట్టా, బిరుదు ప్రదానం చేస్తామన్నారు. మౌఖిక విధానం ద్వారా జరిగే ఈ పరీక్షకు అభ్యర్థులు http://appurohita brahmana samakhya .com/en/form/apply-exam/ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి రుసుము లేదని స్పష్టం చేశారు. ఆయనతో పాటుగా జిల్లా అధ్యక్షులు మేడూరు సంతోష్ శర్మ, గౌరవ అధ్యక్షులు పెంట శ్రీధర్‌శర్మ, జిల్లా క్రీడా విభాగం చైర్మెన్ వాహినీపతి షణ్ముఖశర్మ, కోనపులి శ్రీనివాస్‌శర్మ, భాగవతుల గౌరీశంకర్‌లు తెలిపారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఆడిట్ ఆర్‌డీడీ



సీతారామారావుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని స్టేట్ ఆడిట్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.సీతారామారావు గురువారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, స్టేట్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూల నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పలుమార్లు వాయిదా పడిన ప్లేస్‌మెంట్ ఆఫీసర్, బోర్డాఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీడీసీ పోస్టుకు 11 మంది, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పోస్టుకు 9 మంది హాజరయ్యారు. వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో ముగ్గురు నిపుణుల కమిటీ ఈ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఎంపికైన వారి వివరాలు త్వరలో ప్రకటిస్తామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సైన్స్ అవార్డుల రద్దు తగదు



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్

లావేరు: సైన్స్ అవార్డులు రద్దు చేయడం శాస్త్ర పురోగతికి అడ్డుకట్ట వేయడమేనని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్ అన్నారు. మండలంలోని అదపాకలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైన్సు, హెల్త్ రంగాల్లో అవార్డులు నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్సు అకాడమీ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. పాఠ్యాంశాల్లో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం సరికాదన్నారు. విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను తెలియపర్చకూడదనే భావన పాలకుల్లో రావడం, అశాస్త్రీయ అంశాలైన జ్యోతిష్యం, వాస్తు అంశాలను పాఠ్యాంశాలుగా చేర్పించడం తిరోగమన చర్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను మేధావులు, శాస్త్రవేత్తలు ఖండించాలన్నారు. ఆయనతో పాటు జేవీవీ జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

అన్ని గ్రూపులూ ఏ-గ్రేడ్‌లో ఉండాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

ఎచ్చెర్ల క్యాంపస్: అన్ని స్వయం సహాయక సంఘాలు ఏ-గ్రేడ్‌లో ఉండాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి.వి.విద్యాసాగర్ అన్నారు. ఎచ్చెర్ల వెలుగు కార్యాలయంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామైఖ్య సంఘం యూనిట్‌గా సంఘాలు బలోపేతం కావాలన్నారు. నెలవారీ పొదుపు, రుణ వాయిదాల చెల్లింపు, మహిళల వ్యాపార యూనిట్ల నిర్వహణ, జీవనోపాధుల యూనిట్ల నిర్వహణ వంటి వాటికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలతో ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం రామ్మూర్తి, సీసీలు హరి కృష్ణ, సత్యవతి పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,450–00
బంగారం(22సి. 10గ్రా.)	54,500–00
వెండి (కిలో)	75,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹145	₹270	₹ 280

రిజిస్ట్రేషన్ శాఖలో..

రికార్డుల డిజిటలైజేషన్

- పాత రికార్డుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది
- 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొనసాగుతున్న ప్రక్రియ



టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పురాతన రికార్డులను స్కానింగ్ చేస్తున్న సిబ్బంది

టెక్కలి: ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా రాష్ట్ర సర్కారు సరికొత్త విధానాలకు నాంది పలుకుతోంది. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలను గ్రామ వార్డు సచివాలయాల ద్వారా నేరుగా అందజేస్తోంది. ఈ క్రమంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పురాతన రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి డిజిటలైజేషన్ చేయిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయితే రిజిస్ట్రేషన్ శాఖ పరంగా ఈసీలు, మార్కెట్ విలువలు, నకలుతో పాటు మరికొన్ని పబ్లిక్ కాపీలను సులువుగా పొందవచ్చు. అంతే కాకుండా గ్రామ సచివాలయం పరిధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరంగా మారనుంది.



స్కానింగ్ చేసిన పాత రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

ఇప్పటికే 3550 వాల్యూమ్స్ పూర్తి..

జిల్లా వ్యాప్తంగా శ్రీకాకుళం, నరసన్నపేట, రణస్థలం, ఆమదాలవలస, పొందూరు, టెక్కలి, పలాస, కోటబొమ్మాళి, పాతపట్నం, హిరమండలం, మందస, ఇచ్ఛాపురం, సోంపేట తదితర మండలాల్లో 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నారు. 7718 వాల్యూమ్స్‌కు గాను ఇప్పటికే 3550 వాల్యూమ్స్‌లో గల రికార్డులను స్కానింగ్ చేసి వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి జరిగితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించిన కొన్ని రకాల సేవలను ఇంటి వద్ద నుంచి నేరుగా పొందవచ్చును.

వేగవంతంగా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పాత రికార్డులను సగానికే ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత వివిధ రకాల సబ్ రిజిస్ట్రార్ సేవలను సులువుగా పొందే అవకాశముంటుంది.

– కె.మన్మథరావు, జిల్లా రిజిస్ట్రార్

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఆనందదాయకం



బల్లిపుట్టుగలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను ఆహ్వానిస్తున్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జేఏసీ



కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావును ఆహ్వానిస్తున్న సంఘ ప్రతినిధులు

కవిటి: రెండున్నర దశాబ్దాల కష్టాలకు విముక్తి కల్పిస్తూ ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ తమ సర్వీసు క్రమబద్ధీకరణ చేయడం ఆనందదాయకమని ఇచ్ఛాపురం నియోజకవర్గ కాంట్రాక్ట్ ఎంప్లాయ్స్ జేఏసీ సభ్యులు అన్నారు. ఈ మేరకు గురువారం బల్లిపుట్టుగలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావులను వారి నివాసాలలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబాలలో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి 'థాంక్యూ సీఎం సార్' పేరిట శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈ నెల 25న నిర్వహించనున్న అభినందన సభకు రావాలని ఆహ్వానించారు. అనంతరం సంఘం తరఫున దుశ్శాలువలతో సత్కరించి పుష్పగుచ్ఛాల్ని అందజేశారు.

25న ఉత్తరాంధ్ర సమతా సమ్మేళనం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సమరసతా వేదిక సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి ఫంక్షన్ హాలులో ఈ నెల 25న ఉత్తరాంధ్ర జిల్లాల సమతా సమ్మేళనం నిర్వహిస్తున్న సామాజిక సమరసతా వేదిక కన్వీనర్ బార్ల వేణుగోపాల్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మహోన్నత వారసత్వాన్ని ఆచరించి మనకందించిన మహనీయులను స్మరించుకుంటూ సమరసతా సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సర్దార్ గౌతులచ్చన్న, బంకుపల్లి మల్లయ్యశాస్త్రి, పొట్నూరు స్వామిబాబు, కె.గణపతిముని, బెవర వేణుగోపాలనాయుడు, గురజాడ అప్పారావు, తాతా సుబ్బరాయశాస్త్రి, పాకలపాటి గురువులు, తెన్నేటి విశ్వనాథం, టి.సీతారామస్వామి వంటి వారిని గుర్తు చేసుకునేందుకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ కె.అమ్మన్నాయుడు, కె.వి.ఎస్.మూర్తి, వేదిక ఉత్తరాంధ్ర సంయోజక్ పెంట హాటకేశ్, జిల్లా విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు పాల్గొన్నారు.

నైపుణ్యాధారిత విద్యకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు నైపుణ్య విద్య అందించే లక్ష్యంతో బోధకులు ముందుకు సాగాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ఎస్ఎంపురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో గురువారం ఈసీఈ, మెకానికల్ బోధకులకు ఆన్సస్ సాఫ్ట్‌వేర్ ప్రాధాన్యత, వినియోగంపై రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్ రిలీవ్ అయ్యే విద్యార్థులకు మంచి ప్యాకేజీతో కూడిన ప్లేస్‌మెంట్లు లభిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలు, ఉద్యోగ, ఉపాధి కల్పన విద్యా ప్రమాణాలు లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. సాంకేతిక విద్యలో నూతన ఆవిష్కరణలు, అధునాతన విద్యా పద్ధతులు కీలకమని చెప్పారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో నైపుణ్యాధారిత విద్యకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. బోధకులు సైతం సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్ బాబు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, అధికారులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

విద్యతోనే ప్రగతి సాధ్యం

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి



కిశోర బాలికల సమస్యలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యతోనే ప్రగతి సాధ్యమవుతుందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సెమినార్ హాల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని పటిష్టంగా, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. విద్యతోనే పేద కుటుంబాల్లో వెలుగు వస్తుందన్నారు. విద్యలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువస్తోందన్నారు. యువతను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వ ముందుకు సాగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి నాలుగేళ్లలో రూ.14,300 కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టిపెట్టారని చెప్పారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు వల్ల పేద విద్యార్థులు విద్యకు చేరువవుతున్నారని తెలిపారు. నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు, హానర్స్, రీసెర్చ్ కోర్సులు, సింగిల్ డిగ్రీ కోర్సులు వంటి ప్రారంభించనున్నట్లు వివరించారు. కమ్యూనిటీ సర్వీసెస్, కమ్యూనికేషన్ స్కిల్ డెవలప్‌మెంట్, ఇంటర్న్‌షిప్‌లకు ఉన్నత విద్యలో ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ ఉపాధే లక్ష్యంగా విద్యలో మార్పులు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పి.అర్జున, సోషల్ వర్క్ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్యామల సంయుక్తంగా రచించిన 'కిశోర బాలికలు సమస్యలు' అనే పుస్తకాన్ని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వీసీ నిమ్మ వెంకటరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయ్‌భాస్కర్, సీహెచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు స్థలం ఖాళీ చేయాల్సిందే



పీర్లపంజా స్థలంలో కంటైనర్‌ను తొలగిస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని వక్ఫ్‌బోర్డు స్థలంలో ఎవరి అనుమతులు లేకుండా ఏర్పాటుచేసుకున్న దుకాణాలను మూడు రోజుల్లో ఖాళీచేయాలని ఏపీ వక్ఫ్ బోర్డు స్పెషల్ టాస్క్‌ఫోర్సు అధికారి ముసాబిన్ ఇబ్రహీమ్ ఆదేశించారు. ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ గురుప్రసాద్ అధ్యక్షతన వక్ఫ్‌బోర్డు టాస్క్‌ఫోర్సు అధికారులు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛందంగా ఖాళీ చేయకపోతే జేసీబీలతో తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వ్యాపారుల సమస్యను వక్ఫ్‌బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం పీర్లపంజా స్థలంలో కంటైనర్‌ను పోలీసుల సమక్షంలో తొలగించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఆడిటర్ సాధిక్, పీర్లపంజా ధర్మకర్త ఎంఎస్ రబ్బాని, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, పట్టణ ఎస్ఐ కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మరింత పటిష్టంగా నిఘా వ్యవస్థ



నందిగాం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

టెక్కలి:

నేరాల నియంత్రణలో భాగంగా నిఘా వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. నందిగాం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వ్యవస్థను గురువారం ప్రారంభించారు. అంతకుముందు స్టేషన్ ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వార్షిక తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పోలీస్ స్టేషన్ పరిధిలో నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి, సీఐ కె.చంద్రమౌళి, ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా సార్వత్రిక పరీక్షలు

- 10వ తరగతికి 3, ఇంటర్‌కు 4 కేంద్రాల ఏర్పాటు
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జూన్ 26 నుంచి జూలై 4 వరకు జరగనున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ సార్వత్రిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పరీక్షల నిర్వహణపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 634 మంది 10వ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని, ఇందుకోసం 3 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 996 మంది ఇంటర్ పరీక్షలకు హాజరుకానుండగా 4 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా అన్ని కేంద్రాలలో ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి ఆశా, ఏఎన్‌ఎంలను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండాచూడాలని అధికారులను ఆమెఆదేశించారు. ప్రశ్నపత్రాల పంపిణీ సమయంలో, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎక్కడా జిరాక్స్ కేంద్రాలు తెరవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పూలు కోస్తుండగా చైన్‌స్నాచింగ్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న బలగ గౌరీ నిర్మల అనే మహిళ ఇంటి ఆరుబయట పూలు కోస్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును గురువారం సాయంత్రం తెంచుకుపోయాడు. బాధితురాలు కేకలు వేసే లోపే అడ్డదారిలో పరారయ్యాడు. ఈమె భర్త బలగ వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీ గెస్ట్ ఫ్యాకల్టీకి న్యాయం చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో కొన్నేళ్లుగా పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయినులను తొలగించడం సరికాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా సమగ్రశిక్ష కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలు 2009 నుంచి ప్రారంభమయ్యాయని, ప్రస్తుత కాంట్రాక్ట్ రిక్రూట్‌మెంట్‌లో దరఖాస్తు చేసుకుంటున్న వారిలో టెస్ట్, ఇంటర్లో మార్కుల విధానానికి, గ్రేడింగ్ విధానానికి వ్యత్యాసం ఉండడం వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు నష్టపోతున్నారని చెప్పారు. 30 ఏళ్లు పైబడినవారికి ఏడాదికి 2 మార్కుల చొప్పున వెయిటేజీ కల్పించాలని, గరిష్టంగా 20 మార్కులు ఉండాలన్నారు. పోస్టులకు పీజీ అదనపు అర్హత మాత్రమే అవుతుందని, పీజీ వెయిటేజీ మార్కులు తొలగించి, ఆ మార్కులను వయసులో కలిపేలా మార్పులు చేయాలని కోరారు. ప్రభుత్వం కేజీబీవీలో పని చేస్తున్న వారిని కాదని కొత్తగా నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయడం బాధాకరమన్నారు. నిరసన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు పి.లక్ష్మి, వి.ధనలక్ష్మి, పి.శ్రీదేవి, వై.కృష్ణవేణి, బి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఐదుగురికి గాయాలు
- పైడిభీమవరం జాతీయ రహదారిపై ఘటన



క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం



ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం పలాస నుంచి విశాఖపట్నం వైపు 35 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయలు దేరింది. పైడిభీమవరం వద్దకు రాగానే ముందు వెళుతున్న లారీని బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ సవర కన్నయ్యతో పాటు జలుమూరు మండలం టెక్కలిపాడుకు చెందిన సీహెచ్ శివ, శ్రీముఖలింగం గ్రామానికి చెందిన పి.విశ్వనాథం, పి.లక్ష్మి, జలుమూరుకు చెందిన గవరయ్యలకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వచ్చేలోపే అరబిందో అంబులెన్సు ద్వారా క్షతగాత్రులను శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను ఇతర బస్సులో పంపించారు. బాధితుడు గవరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ కన్నయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయాలి



సామల సింహాచలం

ఇచ్ఛాపురం: ఎంఈఓ-1 పోస్టుల కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా విద్యార్థులకు ఆటంకం కలగకుండా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు సకాలంలో పూర్తి చేయడం శుభపరిణామమన్నారు. కొత్తగా 679 ఎంఈఓ-2 పోస్టులను మంజూరు చేసి వాటిని జిల్లాపరిషత్ హెచ్‌ఎంలతో భర్తీచేసి గెజిటెడ్ హోదాను కల్పించడంతో ఉపాధ్యాయులకు మేలు జరిగిందన్నారు. ఇదేవిధంగా ఖాళీగా ఉన్న ఎంఈఓ-1 పోస్టులను ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్‌ఎంలతో భర్తీచేస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించడాన్ని ఉపాధ్యాయ సంఘాలు స్వాగతిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు షెడ్యూల్ ప్రకటించాలని కోరారు.

ఆదుకుంటాడనుకుంటే.. అనంతలోకాలకు

- గాయపడిన యువకుడు మృతి



ఈశ్వరరావు బెహరా (ఫైల్)

మందస: ఉపాధితో ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనోపాధి చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఆ యువకుడ్ని మృత్యువు వెంటాడింది. ఆదుకుంటాడనుకున్న కుమారుడు ఇక లేడని తెలిసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. మందస పట్టణంలోని కాపువీధికి చెందిన పొందర సదానంద బెహరా, మాలతి బెహరాల కుమారుడు ఈశ్వరరరావు బెహరా(30). టెక్కలి సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బైరిసారంగపురం, పలాసలో చికిత్స చేయించారు. ఫలితం లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. మృతునికి భార్య పార్వతి, 8 నెలల కుమారుడు ఉన్నాడు. సాధారణ ప్రమాదంగానే భావించిన కుటుంబీకులు రుషి మరణించాడని తెలియగానే బంధువులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని మందస తీసుకువచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

బైక్ బోల్తాపడి విద్యార్థి మృతి



సూర్య (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: స్నేహితునితో కలిసి బైక్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా బెజ్జిపద్ర గ్రామానికి చెందిన పది సూర్య(15) కవిటి మండలం నెలవంక పంచాయతీ దుర్గమ్మపుట్టుగలో ఉన్న పెద్దమ్మ దుర్గాసి రుద్రాక్ష ఇంటి వద్ద ఉంటూ పదో తరగతి చదువుకుంటున్నాడు. బుధవారం స్నేహితుడు దుర్గాశి విశ్వనాథంతో కలిసి రాత్రి ఏడు గంటల సమయంలో ఇచ్ఛాపురం నుంచి బైక్‌పై వస్తుండగా ఈదుపురం వంతెన వద్ద అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు స్పందించి హుటాహుటిన ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించగా, సూర్య పరిస్థితి విషమించడంతో బరంపురం ఎంకేసీ రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సూర్య తండ్రి చంద్రమౌళి కొద్ది నెలలు క్రితమే మృతి చెందాడు. సూర్య మృతి చెందడంతో తల్లి కాంచనతో పాటు పెద్దమ్మ రుద్రాక్ష కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రూరల్ ఎస్ఐ వి.రమేష్ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.